# శ్రీ శంకర ప్రోక్త

## శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార పటలము

(శ్రీరమణుల వాగమృత ధారాసహితము)

భగవాన్ శ్రీరమణుల అనుగ్రహంతో

తెలుగు అనువాదం

**ముదిగొండ వీర భద్రయ్య**

# పరిచయ వాక్యాలు

శ్రీదేవికాలోత్తర జ్ఞానాచార విచారపటలమన్న దానిని ఉపాగమంగా పరిగణిస్తారు. జ్ఞానాన్ని గురించి, తత్సిద్ధికి అనుసరించాల్సిన ప్రవర్తన గురించి, శివుడు పార్వతికి చేసిన బోధ ఈ రచనలోని విషయం. ఇది జ్ఞానమార్గానుసారులకు ఎంతగానో తోడ్పడే గ్రంథం.

భగవాన్ శ్రీరమణులు అరుణాచలంలోని అరుణగిరిమీద 1910 నుంచి 1916 దాకా విరూపాక్ష గుహలో ఉండినారు. ఈ నివాసకాలం తొలినాళ్ళలో, 1910కి ముందు వారికాలోత్తరాన్ని చదవడం తటస్థించింది. చదివీ చదువగానే అందులో 1895లో వారికి కలిగిన జ్ఞానావిష్కార అనుభవ సామ్యాన్ని గుర్తించారు. తాను అరుణాచలం నుంచి లోకానికి ప్రసాదిస్తున్న జ్ఞానమార్గమూలాలీ ఆగమంలో ఉన్నందున ఎంతో ఉత్సాహంగా దానిని తమిళ పద్యాలలోకి అనువదించారు. కాని ఇది 1930లో నారాయణరెడ్డిగారు అచ్చేసేటంత వరకు రాతప్రతిగానే ఉండింది. పారాయణానుకూలంగా ఆ తర్వాత భగవాన్ దీనిని కొంత సవరించారు. మలిముద్రణలలోగాని భగవాన్ తనపేరుని అనువాదకునిగా వేసికోవడానికి ఒప్పుకొనలేదు.

భగవాన్ మొదటిదశలో మౌనస్వామిగానే ఉన్నప్పటికీ గిరిపైకి చేరుకొన్న కొన్నాళ్ళనుంచి జిజ్ఞాసువులడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్తూండేవారు కదా. వాటిల్లోనూ ఈ కాలోత్తరంలోని అంశాలకు జతచేయాల్సిన అంశాలు, వాటిని సమర్థించే అంశాలు, వాటి అనంతరం తెలిసికోవాల్సిన విషయాలు అగుపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ తెలుగు అనువాద రచనలో వాటిని ఆయా శ్లోక తాత్పర్యాల కింది భగవాన్ అభిప్రాయాలుగా ఇవ్వడమైనది. 'శ్రీరమణభాషణములు' నుంచి అధికభాగం, రెండు మూడు 'నీ సహజస్థితిలో ఉండు' అన్న గ్రంథంనుంచి తీసికొన్నాను. భగవాన్ తమిళంలో పద్యాలుగా అనువదించారు కాబట్టి ఈ తెలుగు అనువాదంలోనూ మాత్రాఛందాన్ని ఆశ్రయించి లయాత్మకంగా దైవప్రేరణచే రచించాను. లయభంగమైన చోట్లు కొన్ని ఉన్నప్పటికీ, మూలవిధేయత సడలకుండడం కోసం స్వేచ్ఛగా ఊతపదాలను, అనవసర పదాలను తీసికొనకుండా, వాటిని పట్టించుకొన కుండా అట్లే ఉంచినాను.

మా చిన్నవాడు చి॥ మల్లికార్జున శాస్త్రి గ్రంథసాయం చేసి ఎంతో తోడ్పడినాడు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యులయిన మా విద్వన్మిత్రులు బూదాటి వేంకటేశ్వర్లు గారిచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. వీరిద్దరిని భగవాన్ ఇతోధికంగా జ్ఞానమార్గగాములుగా చేయాలని ప్రార్థిస్తూ, డి.టి.పి. చేసిన చి॥ల॥సౌ॥ దేవిప్రసూన ను ఆశీర్వదించమని ప్రార్థిస్తూ,

జిజ్ఞాసువు

**ముదిగొండ వీరభద్రయ్య**

**"ప్రతివాడూ ఆత్మనే చూస్తాడు. దేవతాకృతులు సత్యసముద్రంలోని బుడగలు. సినీతెరపై కదలాడే చిత్రాలవంటివి."**

**"దాస్యంహెచ్చక, బంధనాలు సడలేట్లుగా కర్మలు చేయవలె. అదే నిష్కామకర్మ"**

– భగవాన్ శ్రీరమణులు

# శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార పటలము

గణేశ స్తుతి:

**శ్రీ గణేశు కరుణాసముద్రుదివ్యామృత మౌనరూపు**
**పార్వతికి శంకరప్రోక్తమగునీ శ్రీదేవి కాలోత్తరానుసర**
**సాధక పుష్పప్రకాశు, జగత్సాక్షి కేవలుమౌనివర్యుధ్యానింతు**

– జగన్మాతయైన శ్రీపార్వతికి శ్రీశంకరుడు చెప్పినదీ శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచారపటలమను ఉపాగమం. దీనిననుసరించే సాధకులనెడి పూలకాంతిచేత, ప్రకాశించునట్టి శ్రీ గణేశుని భగవాన్ శ్రీరమణులు స్తుతిస్తున్న ధ్యానశ్లోక అనుసరణం ఇది.

శ్రీదేవీ ఉవాచ:

**1. సర్వజనుల ముక్తికొఱకు మోక్షమార్గమెరుగుటకయి**
**జ్ఞానమననేమొ, ఆచారమదెట్టిదో, తెలుపుమయ్య, జగత్పతీ!**

ఈశ్వర ఉవాచ:

**2. జ్ఞానాచారముల రెంటిని నీకిపుడె తెల్పెద వరారోహ!**
**నిర్మల మోక్షమందెద్దానిచే జ్ఞానసాధకులు ప్రవేశింతురో.**

**3. వరాననా! కాలజ్ఞానమ్ముచే జ్ఞానప్రాప్తికలుగకున్న**
**శతకోటి శాస్త్రములచేనైన బోధము పొందలేరు.**

– సాధన అంతిమదశలో బోధపడే జ్ఞానం కాలజ్ఞానం. ఈ ఉప ఆగమంలో అంటే శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచారంలో శ్రీ శంకరులు శ్రీదేవికి బోధచేసినదీ జ్ఞానమునే. దీనిని పొందుటకు ఏవేవి చేయకూడదో, ఏవేవి చేయవలయునో – కూడ చివరి శ్లోకాలలో వారుపదేశించినారు.

– ఈ భావాలను పోలిన భగవాన్ శ్రీరమణుల బోధలీ కిందివిధంగా ఉన్నాయి.

– శాస్త్రాలు, ఎఱుక గలిగినవారికి కావు. వారికవి అనవసరం. అజ్ఞానులు వాటిని కోరరు. శాస్త్రాలు పరికించేవారు ముముక్షువులు మాత్రమే. అంటే జ్ఞానులకూ, అజ్ఞానులకూ కూడా శాస్త్రాలు వలదన్నమాట.

– శాస్త్రవైదుష్యం తనకు తానొక వాసన. అనుభవం సమాధి.

– నిరక్షరాస్యత అజ్ఞానం; పాండిత్యం చదువుకొన్న అజ్ఞానం. ఇర్వురూ సరియైన గమ్యమేదో తెలియని వారే.

**4. అందువలన నోపార్వతి, శంకాభీతుల విడచిపెట్టి**
**నిరాకులవై, శ్రద్ధతోడ, జ్ఞానసిద్ధికుత్సాహివికమ్ము.**

**5. సర్వభూతాభయప్రదవగుచు, నిర్మమకరుణలతో**
**ముక్తికొఱకు (యోగతత్పరతతో) ఓ దేవి భజించు మీకాలోత్తరమును.**

**6&7. గాలివలె చలించు చిత్తము నెవడు నిశ్చలము చేయు**
**అతడె షణ్ముఖు, డతడె గురువు సర్వదేవతలకు, నతడె**
**యోగి, అతడె తపోధనుడతడె పండితుడు**
**పరమార్థము చేత నతడె కృతార్థుడు, మహాభాగుడు!**

– నిశ్చలంగా ఉండు. నేను బ్రహ్మమని తెలుసుకో. నిశ్చలంగా ఉండడమంటే ఆలోచనలు లేకుండా, అని తెలుసుకో. తలపులు మాను అన్నది ప్రధానం. (భాషణములు).

**8&9 వాయురీతి కదలు మనము నే ఉపాయము చేత బంధింతురొ**
**నదియె మోక్షమునకుపాయమౌ, సత్తుని పొందనదె గుణమగు**
**అదియె ప్రజ్ఞ, అదియె స్థిరత, అదియె పుణ్యమగు సాధకులకు**
**అదియె తీర్థమదియె దానమ్ము, నిస్సంశయముగ నదియె తపము.**

– ఆత్మ శుద్ధచైతన్యం. ఆత్మను తెలుసుకోవడానికి చేయవలసిందంతా 'నిశ్చలంగా' ఉండటమే.

– ఉండటమే నీ విధి, ఇట్లుండుట, అట్లుండుట కాదు. ఆ విధానమంతా ముక్తసరిగా 'నిశ్చలంగా ఉండు', 'ఊరకే ఉండు' లో ఉంది. నిశ్చలత అంటే ఏమిటి? నిన్ను నీవు నష్టం చేసుకొమ్మని. రూపమేదైనా సంకటకారణమే.

– నిజమే. అచల చిత్తమే శుద్ధమనస్సు. జ్ఞాని మనస్సు శుద్ధ మనస్సు. బ్రహ్మము జ్ఞాని మనస్సు కన్యము కాదని జ్ఞాన వాసిష్ఠమే చెప్పుచున్నది. కాబట్టి బ్రహ్మము శుద్ధ మనస్సే.

**10. చిత్తచలనమె సంసారమగు తన్నిశ్చలతయె మోక్షమగు**
**అందువలన పూర్ణప్రజ్ఞతోడ చిత్తమునిక స్థిరము చేయగావలె**

– "నేను" అనే స్థితిలో ఏ ఆలోచనా లేకుండా ఉంటే 'నేను' అనే భావం కూడా పోతుంది. అలాగే భ్రమకూడా శాశ్వతంగా పోతుంది. దీపాలను ఆర్పివేసినపుడే, లేక దీపాలకాంతిని తగ్గించినప్పుడే, సినిమాలో బొమ్మని చూడగలవు. దీపాలను వెలిగిస్తే బొమ్మలు కనబడవు. అట్లాగే ఆత్మ అనే జ్యోతియొక్క వెలుగులో అన్ని పదార్థాలూ మాయమౌతాయి.

**11. ఇతరము లేనట్టి ఏకాంతిక సుఖ మెటనున్నదొ అదియె పరమోత్కృష్టము**
**కర్మలేని పరతత్త్వమే బుధుని రంజింపచేయదు?**

– ఏకాంతం అంటే మనసును నిశ్చలంగా నిల్పటం.

– ఆత్మ ఎప్పుడూ కర్త కానేరదు. కర్త ఎవరో తెలుసుకో ఆత్మ దర్శనమిస్తుంది.

– జీవించటానికీ, పనులు చేయటానికీ మనస్సు అవసరమౌతుంది. కాని మనస్సుయొక్క ప్రమేయం లేకుండానే జ్ఞాని ఈ రెండూ చేస్తాడు.

– జ్ఞాని ఎన్ని పనులనైనా చేయవచ్చు. వాటిని ఎంతో సమర్థవంతంగానైనా చేయవచ్చు. ఎటొచ్చీ – తాను చేస్తున్నానని కాని, ఆ పని తనదని కాని భావించదు. అతని దేహాన్ని ఉపయోగించుకొని, ఆ పని చేయించుకొనే శక్తి ఏదో ఉన్నది.

**12. విషయజ్ఞాన నివృత్తుడగు నిర్మల జ్ఞానతత్పర మేధావి**
**తా గోరు కొనకుండగనే అక్షయమగు మోక్షమొందుకద.**

**13. అస్మితాయుక్త చైతన్యమ్ము శక్తియని పిలువబడుచున్నది**
**శక్తి ప్రకాశితమగు నీవిశ్వమ్ము, తత్సంకల్ప దృశ్యరూపమె**
**ఆలంబన విముక్తమైనపుడు నిష్కలంక జ్ఞానమనబడుచున్నది.**

– నిద్ర మేల్కొన్నప్పుడొక వెలుగు కనిపిస్తుంది. అది మహత్తత్త్వం గుండా వెడుతున్న ఆత్మప్రకాశం. దానిని విశ్వచైతన్యమన్నారు. అది అరూపము. ఆ తేజం అహంకృతిపై పడి ప్రతిఫలిస్తుంది. అపుడు దేహమూ ప్రపంచమూ గోచరిస్తాయి. ఈ మనస్సు స్వరూపము ఈ ఆభాస చైతన్యకాంతిలో విషయాలు అగుపిస్తాయి. ఈ కాంతిని 'జ్యోతి' అన్నారు.

**14. ఏ శూన్యము చిన్మాత్రకమై కేవలమై, అహమనునంశయగు**
**నది ముక్తి బీజమగుచు సద్యోగ ప్రవర్తకమనబడు**

– తలపెక్కడ పుట్టుతుందో చూడు; మనస్సునుండి. మనో వ్యాపారాలు ఎవరికో చూడు; అహమికకు. మనస్సు నా అహమికలో లీనంచేసి, అహమిక మూలం వెదుకు; అది అదృశ్యమౌతుంది. (అప్పుడది 'అహం'గా ముక్తిబీజమవుతుందన్నది దీనికి కొనసాగింపు.)

**15. నాడీ చక్ర పద్మదేవతా బీజ రూపాదులనెపుడు ధ్యానించరాదు.**

**16. అక్షయమగు మోక్షేచ్ఛగలవారలీ కుంభక మంత్రజాల**
**ప్రాణాయామ ధారణాది సర్వమ్ము నొనరింప బనిలేదు.**

– హఠయోగం శుద్ధిచేయు పద్ధతి. అది ప్రాణాయామానికి దారితీసి నీకు మనశ్శాంతి కూడా కల్గిస్తుంది.

– మనో నిగ్రహానికి ప్రాణాయామముపకరిస్తుంది. కాని ప్రాణాయామం మాత్రంతో ఆగకూడదు. దానిపైని ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులను గూడ అభ్యసించవలె. అప్పటికిగాని పూర్ణప్రయోజనం సిద్ధించదు.

– తలపులను సూటిగా అరికట్టలేని వానికి ప్రాణాయామం విధించారు. ధ్యానం ఫలించిన తర్వాత ప్రాణాయామం లేకున్నా మనస్సు ఆధీనంలోకి వస్తుంది.

**17.** **ఇట పూజా నమస్కార జపధ్యానములు లేవు**
**జ్ఞేయమొకటి తప్ప తెలియవేరొకటి లేదు.**

**18.** **బహిర్ముఖ చిత్తులకు జనియించు బంధహేతువులు**
**బహిశ్చిత్త వారణ చేతనె లోకబాధ పొంద నేరరు.**

**19.** **బైటనని, లోననని, నడుమనని, క్రిందయని ఏదియు లేదు**
**సర్వాకార మదియె, నిరాకారమయ్యు, స్వదీప్తితో స్వయం వేద్యమది**
**(తనకు తానె తెలియబడునది స్వయం ప్రకాశమ్ముతో)**

– నీ నిజస్థితిలో ఉండు. దిగి రావలసినది గాని, ప్రత్యక్షమవ వలసినది గాని ఏదీ లేదు. అహంకారం పోవటమొక్కటే జరగవలసినది. నిత్యమూ సంస్థితమై ఉండేది ఎప్పుడూ ఉంటుంది.

**20.** **దేనినాలోకించి జీవులొనరింతురొ కర్మ బాహుళ్యమ్ము**
**తత్ఫలము నొందెద, రందువలన నిరాలోకమునవలంబింపవలె**

**21.** **స్వభావ స్థితిలోన హేతువులేదు, ఫలములేదు, కర్మలేదు**
**లోకము లేదు, లౌకికుడు లేదు, ఈ సర్వమ్మును లేదు.**

**– నీ సహజస్థితిలో ఉండు.**

– జగద్భావనలతోనే తల మున్కలుగా ఉంది. అసలు ఉద్దేశ్యం భావనలన్నీ వదలగొట్టి శుద్ధాత్మలో స్థిరపడవలెనని. భావశూన్య సద్భావస్థితి.

**22.** **ఈ సర్వమున కాధారమ్ము లేదు, నిరాధారమే దీని దీపింపజేయు**
**దీని నిరాధారమొనరించి నిరాలంబుడగు.**

**23.** **మహాశూన్య వ్యాపకమగు నీ వ్యోమాకారమ్ము నెవడు భావించడో**
**అతడు లోకమందు సంసారియగు – కోశమందలి పట్టుపురుగు చందమ్మున**

**24.** **యోనులన్నిటిలోను మాటి మాటికి మహాక్లేశమే సర్వజీవులకు**
**సర్వ క్లేశ విముక్తి కొఱకు ధ్యానించగావలె మహాశూన్యమ్మును.**

**25.** **జ్ఞానసిద్ధినిమిత్తముగ, క్రియాచర్యలు చెప్పిరే గాని**
**సాలంబనయోగ త్యాగమ్ముతో, నిష్ప్రపంచము చింతించవలె.**

**26.** **పాతాళమ్మునుండి శక్తివఱకు, పరస్పరాధారితములన్నిటిని**
**శూన్యమనియెడి అస్త్రమ్ముచేత, భంగించువాడెవ్వడో వాడె శూన్యవేది.**

**27.** **విషయాసక్తమగు చిత్తము, మర్కటముకన్న చంచలము**
**సర్వశూన్య పదమందుంచిన, నిర్వాణము ప్రాప్తించును.**

– వాసనల ఒరపిడికి జ్ఞానం చలించకుండ లేదు. కాని సద్గురు సన్నిధిలో వాసనలు, మంత్రరుద్ధమైన అగ్నివలె, చచ్చుబడి, మనస్సు స్తబ్ధమై సమాధి సిద్ధిస్తుంది.

– నిర్వాణమంటే పూర్ణత. పూర్ణస్థితిలో విషయము లేదు; కర్తలేదు. చూచుటకు, తెలియుటకు, అనుభవించుటకు అక్కడ ఏమీ ఉండదు. చూచుట, యోచించుట మనః ప్రవృత్తులు. నిర్వాణంలోనో, 'నేనున్నా'ననే శుద్ధ చిత్తానందం వినా వేరేమీ ఉండదు.

**28.** **సర్వతత్త్వములు తాను కాని, తాను దేహమ్ము కాదు**
**సర్వాభిన్నమగు "నేనున్నాన" ను చైతన్యము సర్వతో ముఖమైనది.**

– "నేనున్నానన్న"దే సాక్షాత్కారం. ఈ ఆచూకీని సాక్షాత్కారమయే వరకూ వెంటాడుతుండటమే విచారమార్గం. విచారమూ, సాక్షాత్కారమూ ఒకటే.

– మంటనుంచి నిప్పుకణం లేచినట్లు ఆత్మనుంచి అహంకారం లేస్తుంది. లేవగానే దేనితోనో తాదాత్మ్యం చెందుతుంది అజ్ఞానిలో. అట్లా దేనితోనైనా ఐక్యత చెందుకుండా అది మనలేదు. అట్లా దేనితోనైనా ఐక్యత చెందే దాని ప్రవృత్తిని నాశనంచేస్తే అది శుద్ధంగా ఉండటమే కాక, తన మూలంలో నిమగ్నమయి పోతుంది కూడా. శరీరంతో తప్పుగా ఐక్యతను చెందటాన్ని దేహాత్మబుద్ధి అంటారు. (నేను దేహాన్ని' అనే భావం). ఇది పోతేనే కాని సత్ఫలితాలు రావు. ఎప్పుడూ రెండు ఆలోచనలకు నడుమగల వ్యవధిలో

"నేను" అనేది శుద్ధరూపంలో అనుభవసిద్ధమవుతుంది. గొంగళీపురుగు ఒకదాని పట్టు విడవాలంటే రెండోది దొరకాలి. అహంకారం కూడా అంతే. ఏ ఇతర వస్తువులూ, ఆలోచనలూ దానిపట్టుకి చిక్కనపుడే దాని స్వరూపం తెలుస్తుంది.

**29. బాహ్యాంభ్యంతరములందాకసము వోలె నీ సర్వమ్ము వ్యాపించు.**
**రూపరహితమగు నీ శ్రేష్ఠానందమ్ము జూచి ఆనందమే అగుదురు కద.**

**30. ఇంధనము లేని యగ్ని స్వయముగ నెట్లు శమియించు**
**గ్రహించుటకేదియు లేని మనసట్లే స్వయముగ లీనమౌ**

**31. మోహికా మూర్ఛమాయా స్వప్నములను చతురవస్థలతో**
**సుషుప్తి జాగ్రదవస్థలను సర్వమున్ పరిత్యజించవలె.**

**32. సూక్ష్మముగ దేహ బద్ధ ప్రాణమ్మునుండి చిత్త బుద్ధ్యహంకారముల నుండి**
**సర్వమ్మునుండి అభిన్నమిదియని చింతించిన పొందెదరు చిత్తు.**

– నీ సహజస్థితిలో ఉండు. వానికన్నింటికి 'అహం' భావనే ఆసరా. ప్రపంచము నీవద్దకు తన్ను తెలుపుకుంటున్నదా? నీవు గదా 'ఇది ప్రపంచం', 'నేను దేహాన్ని' అనడం. కాబట్టి అవన్నీ నీ నిశ్చయాలే. నీవెవరవో తెలిసికో. ఈ సందేహాలన్నీ నశిస్తాయి.

– అహంతా విసర్జనమే సత్యం. అహంతా నాశం జరిగేది, దాని యాధార్థ్యాన్ని వెదుకుట చేతనే. అహంత ఒక పదార్థం కాదు. మనం పెద్దగా యత్నించకనే అది నష్టమై, సత్యం ప్రకాశితమవుతుంది. ఇది ఋజువైన మార్గం.

**33. చురుకుతనము కోల్పోవుచిత్తము నిద్రాస్మరణాదుల చేత**
**ప్రయత్నముచే జాగృతమొనరించి మాటిమాటికి నద్దాని తన చోటనుంచుము (స్పష్టం)**

– నిన్ను కాపాడుకోవలసింది జడతనుంచి. జాగ్రన్నిద్రలు క్రమానుగతాలైతే, అట్టి నిద్ర నిజమైన నిద్రకాదు. అట్టి జాగ్రత్తు నిజమైన జాగ్రత్తు కాదు. నీవిపుడు మేల్కొనియున్నావా? లేవు. నీ నిజస్థితి నెఱుగుట (అందు మేల్కొనుట) అవసరము. నీవు కల్ల నిద్రలో గాని, కల్ల జాగ్రత్తులో కాని చిక్కుపడకు. అందుకే "లయే

సంబోధయేచ్చిత్తమ్", "విక్షిప్తం సమయేత్ పునః" అంటే ఈ అవస్థలు వేనికీ లోనుగాక మెలగుమని యర్థం. వానిమధ్య నీ నిజస్వభావాన్ని కలుషితం గానీక మెలగుమని యర్థం.

**34. చిత్తము నిశ్చలమైనపుడు కదలించకు మద్దాని మే రీతినైన**
**ఎట్టి చింతనయు చేయకు మదియె స్థిరపరచు దాని నచట.**

– శాంతి ఆత్మానుభవము. దాన్ని ఏవిధంగానూ చెదరనీయగూడదు.

– (నీ శాంతి) శాశ్వతం అయితే అదే ఆత్మానుభవము.

**35. ఆశ్రయాలంబనల పాలగుచిత్తము నిరాశ్రయ మొనరించు మీరీతి**
**చంచలమగు దాని నిశ్చలమొనర్చి, కదల్చగా వద్దా నిశ్చలతను.**

**36. సర్వభూతములు లయింపగా ఆకసము నిర్మలమైన యట్లు**
**ధ్యానించు సర్వవ్యాప్తమగు స్వకీయనిర్మల రూపమ్ము**

**37. వాయు సమముగ చలించు చిత్తమ్ము నిశ్చలమొనరించుచో**
**అదియె జన్మ సాఫల్యమ్ము పాండిత్యమ్ము నదియె సుమ్ము.**

**38. పైన గాని, నడుమ గాని, క్రిందగాని, మఱియెచట గాని, చిత్తమ్ము**
**నిలుపవద్దు, అట్టి ధ్యానరీతి వదలి నిరాశ్రయ చేయు మెపుడు దాని**

– మూలాధారం అథోభాగంలో, మధ్యలో హృదయం, సహస్రారం వీటన్నిటికీ పైభాగంలో ఉన్నవనుకోటం, అంతా తప్పు. ఒకమాటలో చెప్పవలెనంటే యోచించటం నిజంగా నీ స్వభావం కాదు.

– నీవు నీవుగనే ఉండు. క్రిందికి దిగివచ్చేది కాని, ప్రత్యక్షమయ్యేది కాని ఏమీ లేదు. అహమికను వర్జించటమొక్కటే నీవు చేయవలసిదని. (షట్చక్రాలపై ధ్యానించడమన్న దానిగురించి ఇది).

**39. చిత్తము నిద్రలోనికి జారుకొన్న మేలు కొన జేయు మద్దాని!**
**చెదిరిపోయిన నద్దాని శమింప జేయి!**
**ఈ రెండును కాని స్థితి కలిగినపుడు!**
**అద్దాని చలింప జేయవద్దు!**

**40.** **చిత్తమెపుడు సర్వావలంబ వర్జితమయి, నిరాశ్రయమగు**
**అట్టి ముక్తమానసావస్థయె ముక్తి లక్షణమని తెలిసికొనుము.**

**41.** **సర్వాలంబన శూన్యమనమును హృదియందు నిలుప**
**ఉద్భవమగు స్పష్ట జ్ఞానమ్ము అభ్యాస పరత్వము కల్గించు.**

**42.** **శ్రేష్ఠ శూన్యమునెవరు ధ్యానింతురో వారలందభ్యాస పరులగుచు**
**జన్మ మృత్యురహితమగు పరమ స్థానమ్ము పొందెదరు.**

– 'శూన్య', 'అతిశూన్య', 'మహాశూన్య' అన్నీ ఒకే అర్థం కలవి. అవి సద్వస్తుపరాలు.

**43.** **దేవీ దేవతలు, ధర్మాధర్మములు వాటి ఫలితములు**
**ఆశ్రయాశ్రయుల తెలివిడి సంసార బంధనములు**

**44.** **ఆశ్రయమన్న ద్వంద్వమనియెదరు ద్వంద్వాతీతులయిన జ్ఞానావాప్తియగు**
**అట్టి యోగియె జీవన్ముక్తుడు దేహానంతరమూ విదేహముక్తుడు.**

– రూపమంటే ద్వైతకల్పన. అది మంచిదా అన్న ప్రశ్నకు భగవాన్ – అట్లు ప్రశ్నించే వానిని విచారమార్గం అనుసరించనీ, రూపార్చనం వానికి కాదు.

**45.** **వైరాగ్యమ్ము వలని శరీరత్యాగమ్ము కార్యమ్ముకాదు మనీషులకు**
**కర్మ నశించినంతనె స్వయముగ నది రాలిపోవును.**

**46.** **హృత్ సరోజమందహము రూపముగ చిత్తు నిర్మల మచలమ్ము**
**అహంకార పరిత్యాగమ్ముచే నాచిత్తు మోక్షదాయినియగు.**

– జనకుడు "నన్ను ఇన్నాళ్ళబట్టి పీడిస్తున్న దొంగ దొరికాడు. అతనినింక విడిచేది లేదు" అని అన్నప్పుడు ఆయన చెప్పేది మనస్సు లేక అహంకారం గురించే.

**47.** **సర్వోపాధి వినిర్ముక్తమగు చిద్రూపము నెపుడును**
**'నేనే శివుడ' నని ధ్యానించి సర్వాసక్తి విడువగా వలయు.**

– తథ్యమైన 'అహం' ఏకమై నిలిచినప్పుడు, అది 'అహం బ్రహ్మాస్మి' అనదు. (కాని ఆ 'ఏకము' అయిన, అంటే అదితప్ప మరొకటి లేకున్న స్థితిని, శివుడనని ధ్యానించవలెనని తాత్పర్యము)

**48.** **దేహ జాత్యాది వర్ణాశ్రమ సమన్వితసంబంధ భావముల**
**పరిత్యజించి, స్వభావమునె సదా భావించగావలె.**

**49.** **నేనొక్కడనె, నా కెవరును లేరు నేనెవరి వాడ కాను**
**నన్ను తన వాడనెడి వాడెవ్వడు నగుపించదు.**

**50.** **నేనే పరంబ్రహ్మమును, జగన్నాథుడను**
**ఈశ్వరుడనని అనుభూతమగుచో**
**వాడె ముక్తుడు; విపరీతమగుచో బద్ధుడు.**

– నేనును కనుక్కో. 'నేను' బ్రహ్మమే. నీవట్లు యోచించినక్కరలేదు. ఊరకే అదేమో కనుక్కో.

**51.** **జ్ఞాన చక్షువుల చేత తన నశరీరునిగ నెపుడు చూచునొ**
**నిరీహుడై అపుడతడు పూర్ణశాంతి ననుభవించు**

**52.** **సర్వశాస్త్రములందెవ్వడజునిగ, నీశ్వరునిగ, నశరీరునిగ**
**నిర్గుణాత్మగ తెలుపబడుచున్నాడో**
**నిస్సంశయముగ అతడె నేను – సోஃహమయమస్మి**

**53.** **జ్ఞానమును, నిరంతర విశుద్ధుడను విముక్తుడనై సర్వత్రస్థితుడను**
**నన్నెవరిదియని నిర్ణయించగలేరు తర్కమ్ముచె దొరికెడి వాడకాను**
**శోకరహితుడనైన నేను సదాబ్రహ్మమయుడను.**

**54.** **శిరసు నుంచి పాద తలమ్ము వఱకు లో బయలుల నుంచి చర్మమ్ము దాక**
**సర్వమ్మును, అమృతరూపుడను – నేనె అనన్య సిద్ధమగు చిద్రూపుడను నేనె.**

– ఆధ్యాత్మిక జీవులు దేహాలు కారు; వారికి శరీరస్మృతే ఉండదు. వారు అవధి, ఆకృతులు లేని ఆత్మమాత్రమే. వారిలో వారికి సర్వానికీ ఏకత ఉంది; ఏకతే కాదు, వారే సర్వమునూ.

**55. ఈ చరాచరమ్ముల కీశ్వరుడను తల్లియు తండ్రియు తాతను**
**చతుర్థ పదీయుడగు నన్నే ధ్యానింతురు మోక్షకాములు**

– తురీయమని ఆత్మకు మరొకపేరు. జాగ్రదాది మూడవస్థలున్నవని ఎఱిగిన మనకు తెలియనిది ఆత్మయొక్కటే.

– ఉన్న అవస్థలు మూడు, జాగ్రత్ స్వప్నసుషుప్తులు. తురీయం నాల్గవది కాదు. పై మూటికి ఆధారమైనది. కాని ఇది సులభంగా అర్థంకాదు. అందువల్ల దానిని నాల్గవ అవస్థగా, ఏకైక సత్యంగా పరిగణించారు. నిజానికి అది దేనికీ భిన్నంకాదు. అది సర్వసంభవాలకు ఆధారం. అది ఏకైక సత్యం. నీ అస్తిత్వమే అది. అవస్థాత్రయము ఆ తురీయం మీద క్షణిక విషయములుగా నగపడి తరువాత దానిలోనే అణగిపోతవి. కాబట్టి అవి యదార్థాలు కావు.

– సినీదృశ్యంలో చిత్రాలు తెరమీది నడనీడలు. అవి తమ్ము కనిపింపజేసికొని, ముందు వెనుకలకు కదలాడి, ఒకదానినుండి మరియొకటిగ మారి, ఎట్లెట్లో వర్తిస్తాయి. అవి కల్లలు. అంతసేపూ మారనిది ఆ సినీ తెరయే. వానిని దేనిపై ముద్రిస్తారో ఆ కేన్వాస్ నిజము. మన విషయమూ అట్లే. ప్రాపంచిక వ్యవహారాలు బాహ్యాంతరాల్లోనివి. అన్నీ తాత్కాలికములు. ఆత్మనుకాదని నిలిచేవి కావు. అవన్నీ నిజాలనీ, మనకు వెలిగానున్నవనీ అనుకొనే అలవాటు బలసిపోయి, వానిని ప్రధానులుగా ప్రదర్శించి, నిజస్వరూపాన్ని దాచివేయటం జరుగుతున్నది. సదా ఉన్నదీ, ఏకైక సత్యమూ అయిన ఆత్మను కనుగోగానే, ఈ కల్లలన్నీ కరిగిపోయి, అవన్నీకూడా ఆత్మకు వేరుకావన్న ఎఱుక మిగిలిఉంటుంది. (ఇక్కడ చతుర్థపదమందున్న శివుడే, ఆత్మ. మోక్షకాములద్దానినే ధ్యానిస్తారని శివోకవాచ).

**56.** **బ్రహ్మాది దేవ మనుష్య నాగ గంధర్వ యక్షోప్సర గణముల చేత**
**అనేక యజ్ఞాదుల చేత పూజ్యుడను నేను, పూజింతురు సర్వులు నన్నే.**

**57.** **ఉగ్రతపములచే వివిధ దానమ్ముల చే సర్వులు నన్నే పూజింతురు**
**స్థావర జంగమ భూతములు నేనే, ఏదియు లేదు నేను తప్ప, నన్నియు నేనే.**

– ప్రతివ్యక్తీ చైతన్యం ఉన్నవాడే, అంటే శివుడే. అతడు శివుడు కావటమే కాదు, అతనికి తెలిసినా, తెలియకున్నా శివేతరము సర్వమూ అతడే. కాని అజ్ఞానవశుడై జగత్తును బహురూపమని తలపోస్తాడు. అతడు తనయాత్మనే చూచి ఉంటే తనకూ ప్రపంచానికీ భేదమే తెలియదు. నిజానికి, వాని వ్యక్తిత్వమూ, అనేక రూపాలుగా వ్యక్తమయ్యే ఇతరములూ అన్నీ మఱిగిపోతాయి. శివునే ప్రపంచంగా చూస్తాడు. కాని ఆ చూచువాడు ప్రపంచానికసలు ఆధారమేమో చూడడు. సాధారణంగా వస్త్రాన్నే చూస్తారు గానీ, దానినిచ్చే ప్రత్తిని చూడరు. సినిమాలో కదలాడే ఛాయాచిత్రాలే చూస్తారు గాని వాని ఆధారమైన తెరను చూడరు. కాగితాన్ని చూడరు, దానిపై అక్షరాలనే గాని. కాబట్టి విషయము రూపచైతన్యముల కూడిక. సామాన్యుడు జగత్తులోని విషయాలనే చూస్తాడు. వాని ఆకృతుల్లోని శివుని చూడడు. మూలము శివుడు. అతడు తాల్చినవే ఇన్ని రూపాలూ, వానిని చూడగల్గిన చైతన్యమూను.

**58.** **స్థూల సూక్ష్మ శూన్యరూపుడకాను, జ్ఞానైక రూపుడ, జగదేక బంధుగుడ**
**నిరంతరుడ, నిర్మలుడ నీశ్వరుడ నేను, స్వప్నాద్యవస్థాచ్యుతుడ నిష్ప్రపంచుడ.**

– జ్ఞానికి ఈ మూడవస్థలూ అసత్యాలే. కాని అజ్ఞానికి అది అర్థంకాదు. అతనికి మెలకువగా ఉన్న స్థితే ప్రమాణం కనుక. జ్ఞానికో, సత్యానికి ప్రమాణం సత్యమే. శుద్ధచైతన్యం యొక్క ఈ సత్యం – శాశ్వతం. అందువల్ల నువ్వు చెప్పే మూడు అవస్థలలోనూ సమానంగా ఉంటుంది. ఆ సత్యంలో ఏకమైన వానికి మనస్సులేదు. ఆ మూడు అవస్థలూ లేవు. అందువల్ల అతనికి అంతర్ముఖమవటం, బహిర్వర్తనమవటం కాని ఉండవు. అతను ఆత్మనే ఎప్పుడూ ఎరిగిఉంటాడు కాబట్టి. అతనెప్పుడూ మెలకువగా ఉన్నట్లే అతనికి ప్రపంచం మళ్ళీమళ్ళీ కనబడే కలవంటిదే. అతనెప్పుడూ గాఢనిద్రలో ఉన్నట్టే – – – దేహమంటూ ఉన్నదన్న ధ్యాసే ఉండదు.

**59.** **అనాదియగు జ్ఞానమ్ము పుట్టుక లేనిది (హృత్) గుహావాసి, నిష్కలంక, నిష్ప్రపంచ**
**నిరంజన, నిష్ ప్రతిమ, నిరీహ అదృశ్యమగ్రాహ్య మచింత్యరూపి**

**60.** **సనాతనుడు శాశ్వతుడునగు బ్రహ్మము నేనని, ధ్యానించవలె ననుక్షణమును**
**అట్టి నిశ్చల భావకుడు బ్రహ్మమేయగు నమృతత్వము నొందు**

**61.** **మోక్ష సిద్ధికిట్లు జ్ఞానకథనానంతరమో పార్వతీ సతీ!**
**నే చెప్పబోయెడి ఆచార విధానమ్ము శ్రద్ధగా వినుము.**

**62.** **స్నానజపపూజాహోమాదులు సాధనములు కావు వానికి**
**అగ్నికార్యాది విధులు గూడ నతని కుండవో మహేశ్వరి**

**63.** **నియమాదులు, క్షేత్రవిధులు, అర్చన పితృ కార్యాదులు**
**తీర్థయాత్రా వ్రతాదులుండవు వానికి.**

**64.** **ధర్మాధర్మ ఫలముండ దాతనికి, లోకమనుసరించు తిథి ప్రకార కార్యము**
**లుండవతనికి.**

**65.** **కర్మ బంధ హేతువగుటచే, సంకల్ప వికల్ప కుల ధర్మ**
**సమయాచారాదు లెవ్వియు నుండవతనికి.**

**66.** **పాతాళ రసాయనాదుల దర్శించుటాది సిద్ధులను**
**ప్రదర్శింప గల్గినను వాని గ్రహింపరాదు సాధకుడు.**

– ఆత్మజ్ఞానంతో బాటు సిద్ధులూ కలుగవచ్చు, లేకనూ పోవచ్చు. ఆత్మానుభూతి పూర్వం వానిని కోరియున్నతనికి, ఆత్మసిద్ధి తర్వాత అవి స్ఫురించవచ్చు. అట్టివేవీ కోరకనే కేవలం ఆత్మానుభవమే అభిలషించేవారున్నారు. వారట్టి శక్తులను ప్రదర్శించరు.

– ఆత్మజ్ఞానం కల్గిన తర్వాతగూడ, సిద్ధులకై యత్నించడం, సాధించడం ఉంది. కాని అట్టివి పరప్రయోజనాన్నర్థించినవి, అంటే ఒరుల మేలునకుపయోగించేవి.

– నిత్యమూ, అత్యంత పరిచితమూ, అయినది ఆత్మ. సిద్ధులు విజాతీయులు. ఒకటి ప్రయత్న సాధ్యం, రెండవది కాదు.

– సిద్ధులు మనస్సు వాంఛించేవి. వానిని సవ్యవసాయులుగనే ఉంచవలె. మనస్సు నశిస్తేగాని, ఆత్మ సిద్ధించదు. అహంకారం ఉంటేనే సిద్ధులు వ్యక్తమౌతాయి. అహంకారముంటేనే పరులు గోచరిస్తారు. అదిలేకుంటే వారూ కనిపించరు. అహమికకు అతీతమైనది ఆత్మ, అహమిక నష్టమైన తర్వాతనే సిద్ధించేది. అహమును తొలగిస్తే, ఎవనికీ ఒరులు తెలియరాదు. ఇట్టి ప్రశ్నకు తావూ లేదు. ఆత్మజ్ఞునికి సిద్ధులతో పనియేమి?

**67. జీవబంధ కారకములివి యన్నియు అధోమార్గ ప్రదాయకములు**
**చిద్రూప ప్రాప్తి వినా వీనిచే పరాముక్తి ప్రాప్తించదు.**

**68. విశేష మెద్దానిచేత మరలకుండ సర్వావస్థల చేయవలె యోగసాధన**
**కౌతుకముచే చేయు క్షేత్ర పూజల సందేహాదుల త్యజియింపగా వలె.**

**69. క్రిమికీటక పక్షి వృక్షాది జీవుల నశింపజేయని**
**బుధుడె పరమార్థ సాధకుడు**

**70. వేర్లను పెకలించవద్దు, ఆకుల త్రెంపవద్దు**
**భూతముల పీడించరాదు, పువ్వుల కోయరాదు**

**71. స్వయముగ నేలరాలిన పూలతోడనె చేయవలె శివపూజను**
**మారణోచ్చాటన విద్వేషన స్తంభనలు చేయరాదు.**

(మారణం = మంత్రాలతో నాశనం చేయడం.
ఉచ్చాటనం = పిశాచాదులను అవి ఉన్నచోటునుండి తోలేయడం
శత్రువు ఒకచోట నిలువకుండా చేసే అభిచారం.
విద్వేషనం = మిత్రులతో పరస్పరం విద్వేషం కలుగజేయడం.
స్తంభనం = మనస్సుని స్తంభింపజేయడం)

– శ్రీ భగవాన్ వారిని 'దేవీకాలోత్తరం' చదివారా? అని అడిగారు. దానిలో అభిచార ప్రయోగాల ఖండనం ఉంది. దానివల్ల చివరకు స్వవినాశమే సమకూడుతుంది. ఆత్మహత్యకు కూడ దారితీస్తుంది. అవిద్యయే చెడుగు; అది చాలనట్లు దానికి తోడుగ అభిచారం కూడ కావలెనా?

ప్రశ్న: – ఆ ప్రయోగాల బారిన పడిన వానికేదైనా ప్రతిక్రియ ఉన్నదా?

మహర్షి: – భక్తియే.

– ... నిందచే నిందను, ఘాతచే ఘాతను అడ్డగించలేము. ఓర్చుకో. ఓర్పు, నొచ్చినతనికి శాంతినిస్తుంది. నొప్పించినాతనికి ఆపులేని అశాంతిని గల్పించి, తన తప్పు నొప్పుకొని తానొప్పించినతని క్షమనర్థించే వరకూ వదలదు. ఈ దేశంలో చిరకాలంగా ఉత్తమోత్తమ యతులలో గూడ అభిచార అభ్యసనం ఉండింది. దారుకావన ఋషులు సాక్షాత్ శివునిపైనే యిట్టి ప్రయోగం చేశారని ఉంది.

– దైవమును వెలివస్తువులగు పుష్పాదులచే పూజించుట వట్టి ప్రయాస. ఒకే ఒక పూవు నీ హృదయము; శివుని పాదములనర్పించి, శాంతిని భజింపుము. ఇంత సులభోపాయమును తెలియక ఊరక పరిభ్రమించుటలా! అంత అజ్ఞానమా! అంత బాధయా!

– (పూలను త్రెంచడమూ జీవహింసే. పూలతో పూజించాలనే అనుకొంటే కిందరాలిన పూలతోటే పూజించవచ్చు. కాని జ్ఞానమార్గానుసారి ఈ పుష్పార్చన విషయికంగా తెలిసికోవాల్సిన విషయాన్ని భగవాన్ శ్రీరమణులు పైవిధంగా తెలిపారు.)

### 72. జ్వర, భూతగ్రహావేశవశ్యాకర్షణ మోహపెట్టుటాది క్షుద్ర కర్మలు చేయరాదు – రాయీ కలపల పూజింపరాదు. (కాష్ఠ పాషాణ పూజనము కూడదు.)

– ఆత్మఉందని ఒప్పుకొంటావు. ప్రతీకను చూసి ఆత్మఇది అంటావా? ప్రాయశః దేహాన్ని నీవు ఆత్మయనుకుంటావేమో? కాని నీ గాఢనిద్రను గుర్తుంచుకో. అప్పుడూ నీవున్నావు. అక్కడ నీ ప్రతీక ఎట్టిది? కాబట్టి ప్రతీక లేకనే ఆత్మానుభవం కలుగవచ్చు.

– (నాకు రూపం లేదంటాను) మంచిదే. నీకు నిద్రలోకూడ రూపులేదు. కాని మేల్కొన్నస్థితిలో ఏదో ఒకరూపంగా నిన్నునీవు నిరూపించుకొంటావా? లేదా? నిజంగా నీ స్థితి ఏదో చూడు. నిజస్థితికి ఆకారంలేదని విచారంవల్ల తెలుస్తుంది. నీజ్ఞానంవల్ల ఆత్మ నిరాకారమని అర్థం చేసికుంటే ఆపాటి జ్ఞానం దైవానికి గూడ పంచి ఆయనకూడ నిరాకారియేయని మన్నించరాదా?

**73. క్షేత్ర దేవతలకైన ముద్రల, యజ్ఞముల**
**కృతక వాసనల గూడ వర్జించి**
**సర్వవ్యాపక జ్ఞాన మాశ్రయించగా వలె.**

**74. సమత్వ విగతరాగత్వ సుఖదుఃఖ సమత్వం**
**శత్రు మిత్ర సమదృష్టి, మృత్ కాంచన సమదృష్టి (ఉండవలె)**

– సుఖదుఃఖాలు మనోవైఖరులు. మన సహజస్వభావం ఆనందం. కాని మనం ఆత్మను మఱచిపోయాము. దేహాన్నో, మనస్సునో ఆత్మయని భ్రమ చెందుతున్నాము. ఆ మిథ్యాన్వయమే అన్ని అనర్థాలకూ మూలం. ఏమి చేయడం? వాసనలు చిరంతనంగా, బహుజన్మలుగా వస్తున్నవి. అందుచేత అవి బలపడ్డవి. సహజస్థితి, అంటే ఆనందం, నిలద్రొక్కుకోవలెనంటే ఆ వాసనలు పోవలె.

– స్నేహం, దయ, సంతోషం వంటివి జ్ఞానికి సహజమౌతాయి. మంచివారిపట్ల ఆప్యాయత, నిస్సహాయుల పట్ల దయా, మంచిపనులు చేయటంలో ఆనందమూ, దుష్టులపట్ల క్షమా, ఇవన్నీ జ్ఞానికి సహజలక్షణాలు.

(పతంజలి యోగసూత్రాలు 1:37) జ్ఞానులకు సత్యమేమిటో తెలుసు కాబట్టి వాళ్ళు అన్ని అవస్థలలో, పరిస్థితులలో ఒకేవిధంగా ఉంటారు.

**75. నిర్మముడు నిరీహుడు ఆత్మారాముడగు యోగి**
**ఇంద్రియార్థాభిలాష కలిగి ఉండడెపుడును.**

**76. నిందా ప్రశంసల సమస్థితి, సర్వజీవ సమత**
**ఆత్మవదితరములను సమదృష్టి – ఉండవలె.**

**77. వివాదముల ప్రాపంచిక గోష్ఠుల కలహముల విసర్జించవలె**
**శాస్త్ర గోష్ఠుల, కుభాషిత, సుభాషితముల – విడువగా వలె.**

**78. మెలిమెల్లిగా ఈర్ష్యాలోభ దంభముల**
**రాగ మాత్సర్య కామ క్రోధ శోకముల**
**సర్వము త్యజించ గా వలె.**

79. సర్వద్వంద్వ వినిర్ముక్తుడైన నిరంతర జన వర్జితుడైన
శరీరమందె సర్వజ్ఞుడయి ప్రకాశించు నతడు.

80. జ్ఞానము చేతనే మోక్షము కలుగు
సిద్ధులు నిరర్థకములు ఐనను సాధకులు
కోరుదురు భోగముల, కోరుదురు సిద్ధుల

81. అణిమాది గుణలబ్ధి కలిగినను కలుగకున్నను
నిర్మలుడగు నీశ్వరుని పొందు దేహి

82. పంచ భూతాత్మకము దేహము, అచటనే ఉండు శివుడు
శివుని నుంచి అవని దాక నీ లోకమంత శివాత్మకమె.

83&84. ఇట్టి జ్ఞాని జూచి ఏ నరులు మనోవాక్కర్మల చేత
గంధ ఫల పుష్ప ధూప స్నాన వస్త్ర భోజనము లర్పింతురో
ఓ దేవి! ముముక్షులగు వారలె ముక్తులగుదురు
స్తోత్ర పరులు పుణ్యముల, నిందాపరులు పాపముల – పొందుదురు.

85. జ్ఞానమన నెద్ది? ఆచరణ మెట్లు ఏతత్సర్వమ్ము చెప్పితినో వరారోహ
ఇది యంతయు కాలజ్ఞానమ్ము మరి ఇతరము వినదలతువా.

❖ శ్రీరమణార్పణమస్తు ❖